ప్రజాశక్తి

శనివారం 9 నవంబర్ 2024 | 5 | అనంతపురం

గుంతకల్లులో ప్రజాపోరుబాట కరపత్రాలను అందజేస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ షాక్..!





- ఉమ్మడి జిల్లాలో చాపకిందనీరులా స్మార్ట్ మీటర్లు
- ప్రభుత్వ కార్యాలయాల పేరుతో ఏర్పాటు
- ఇప్పటికే పలు చోట్ల బిగించిన విద్యుత్ అధికారులు
- తర్వాత ప్రయివేటు వ్యాపార సముదాయాల వంతు..!
- ప్రీపెయిడ్ విధానం అమల్లోకి వస్తే రీఛార్జి చేస్తేనే విద్యుత్



కూటమి ప్రభుత్వం స్మార్ట్‌గా ప్రజలకు షాకిస్తోంది. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్ర స్వరంతో వ్యతిరేకించిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఇప్పుడు దాని గురించి నోరుమెదపడం లేదు. పైగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆమోద యోగ్యమైదనంటూ సన్నాయినొక్కులు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలను ప్రజలపై మోపిన ప్రభుత్వం తాజాగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల పేరుతో అధికారులు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి ఏర్పాటు అయితే విద్యుత్ వినియోగానికి ప్రీపెయిడ్ విధానం అమల్లోకి వస్తుంది. ముందస్తుగా రీఛార్జి చేయిస్తేనే ఇంటికి విద్యుత్ వచ్చే అవకాశం ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గత కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. గత రెండు నెలల క్రితమే శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. ఇప్పుడు అనంతపురం జిల్లాలో కూడా పలు మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. గురువారం నాడు అనంతపురం జిల్లా పుట్లూరు మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్, గ్రంథాలయం, ఐకెపి, సచివాలయం తదితర వాటికి స్మార్ట్ మీటర్లను బిగించారు. ప్రభుత్వ కార్యాలయాల అనంతరం వీటిని ప్రయివేటు వ్యాపార సముదాయాలు, ఆ తర్వాత గృహాలకు బిగించే అవకాశం కన్పిస్తోంది. ప్రీ పెయిడ్ ఆప్షన్ పేరుతో వీటిని రూపొందించారు. సెల్‌ఫోన్ తరహాలో ముందుగా రీఛార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా కావుతుంది. ఒక వేళ ముందస్తుగా రీఛార్జి చేయించుకోకపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వీటి ఏర్పాటుపై ప్రజల నుంచి వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వారి దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వ కార్యాలయాలకు అంటూ స్మార్ట్ మోసానికి తెరలేపినట్లు తెలుస్తోంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ఏ ప్రాంతంలో ఏ మేరకు విద్యుత్ వినియోగంలో ఉంది.. లోవోల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం తదితర సమాచారం విద్యుత్ అధికారులకు వెంటనే అందుతుంది. అయితే వీటిని సాకుగా చూపి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో విద్యుత్ భారాలు మరింత ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల వ్యతిరేకత

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సూచన మేరకు వైసిపి ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను అప్పటి ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ పంపుసెంట్లకు వీటిని ఏర్పాటు చేసేందుకు విద్యుత్ అధికారులు సిద్ధం అయ్యారు. దీనిపై రైతుల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. సిపిఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టి వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి సైతం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి వాటిని ఏర్పాటు చేస్తే తాము పగలగొడతామంటూ ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చాపకింద నీరులా విస్తరిస్తున్నా కూటమి నేతలు ఎవరూ నోరు మెదపకపోవడం గమనార్హం.

ప్రభుత్వ కార్యాలయాలకు పెద్ద చిక్కే...

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ బిల్లుల చెల్లింపు సక్రమంగా జరగడం లేదు. బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ పలు సందర్భాల్లో విద్యుత్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు సరఫరాను నిలిపేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి తరుణంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ఖచ్చితంగా ముందస్తుగా రీఛార్జి చేయించుకోవాల్సి ఉంటుంది. వాడిన తర్వాత బిల్లు కట్టడమే కష్టంగా ఉన్న తరుణంలో ముందస్తుగా కార్యాలయాలకు రీఛార్జి చేయించడం అంటే గగనమే అనుకోవాలి. ముందస్తు రీఛార్జి చేయించకుంటే కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. తద్వారా ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

రీఛార్జి చేయకుంటే విద్యుత్ కట్

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు అయితే వినియోగం తర్వాత బిల్లు చెల్లించే విధానం రద్దు అవుతుంది. సెల్‌ఫోన్ల మాదిరి వినియోగించక ముందే ముందస్తుగా రీఛార్జి చేయించుకోవాలి. నెలలో ఎంత విద్యుత్ వినియోగం అవసరం అవుతుందో దానిని బట్టి ముందస్తుగా రీఛార్జి చేయించుకోవాలి. రీఛార్జి మొత్తం పూర్తవగానే వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.



ఇటీవల అనంతపురం జిల్లా పుట్లూరు మండల పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

సమస్యలపై సిపిఎం పోరుబాట

- జిల్లా వ్యాప్తంగా ఇంటింటి ప్రచారాలు
- ప్రభుత్వాలను ప్రశ్నిస్తేనే సమస్యలు పరిష్కారం
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ తదితర సమస్యలపై సిపిఎం పోరుబాటకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేశారు. గుంతకల్లు పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పాల్గొన్నారు. హంపిరెడ్డి భవనం నుంచి పొట్టి శ్రీరాములు కూడలి వరకు సిపిఎం బృందం ప్రజాపోరు కరపత్రాలను ప్రజలు అందించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 14వ తేదీన కలెక్టరేట్‌తో పాటు మండల కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో విఫలం అయ్యాయన్నారు. గత నెల రోజులుగా కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగ యువత ఎదురుచూసిందన్నారు. డీఎస్సీ వాయిదా పడడం, గ్రూప్-1, గ్రూప్-2 పరిస్థితి ఆగమ్య గోచరంగానే మారడంతో నిరుద్యోగులు ఆందోళనలో పడ్డారన్నారు. ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు అధికం అయ్యాయన్నారు. ఆచూకీ కన్పించకుండా పోతున్న ఆడపిల్లల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయన్నారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమల్లోకి రాలేదన్నారు. మద్యం విక్రయాలను తగ్గిస్తామని చెప్పి పెచ్చేశారన్నారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై కూటమి ప్రభుత్వం వేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా సాగునీటి వనరులకు 7వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం చేపట్టిన ప్రజాపోరు యాత్రకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతీ ప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, వైటిసి రమేష్, వెంకీ, జ్యోతి, షాషా పాల్గొన్నారు.

11లోపు ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 11వ తేదీలోపు ఫ్రీహోల్డ్ అసైన్మెంట్ భూముల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఫ్రీ హోల్డ్ అసైన్మెంట్ భూముల పరిశీలన ప్రక్రియపై జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మతో కలిసి ఆర్డీవోలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ అసైన్మెంట్ భూముల ధ్రువీకరణకు సంబంధించి జిల్లాలో ఎక్కువగా పెండింగ్ ఉన్న కంబదూరు, కుందుర్పి మండలాల్లో ఈనెల 11వ తేదీలోపు పరిశీలన పూర్తి కావాలన్నారు. ఈ మండలాలపై కళ్యాణదుర్గం ఆర్డీవో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈనెల 11వ తేదీలోపు పెండింగ్ ఉన్న మండలాల నుంచి నివేదిక అందించేలా చూడాలని డిఆర్‌ఒను ఆదేశించారు. ఇందులో ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివత్తి చేసుకోవాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఏ.మలోల, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్‌తో పాటు తహశీల్దార్లు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై గట్టి నిఘా

ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచామని ఎస్పీ జగదీష్ తెలిపారు. ఎస్పీ శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి డీఎస్పీ రవిబాబు, సిఐలు వెంకటరమణ, నీలకంఠేశ్వర, ఎస్ఐ రాంభూపాల్, తదితరులతో సమీక్ష నిర్వహించారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు, కేసులు, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల్లో పురోగతి సాధించాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మట్కా, గ్యాంబ్లింగ్, తదితర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఇటీవల జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి సుమారు రూ. 70 లక్షలు పట్టుకున్నామన్నారు. నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ ప్రాంతంలో సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు ఎక్కువగా చోరీకి గురవుతు న్నాయని విలేకరులు ప్రస్తావించగా స్పందించిన ఎస్పీ ఇప్పటి వరకూ ఎన్ని కేసులు నమోదు చేశారు, రికవరీపై డీఎస్పీని ప్రశించారు. అలాగే సీసీ కెమెరాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆరా తీశారు. ఇకపై పట్టణంలో ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహిస్తూ చోరీలు జరగకుండా చర్యలు చేపడతామని వారు తెలిపారు.

గోళ్ల గ్రామసభలో ఎస్పీ

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం రూరల్ సిఐ ఆధ్వర్యంలో మండలంలోని గోళ్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎస్పీ జగదీష్ పాల్గొన్నారు. గ్రామంలో మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్స్, సైబర్ క్రైమ్ వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలు ఎదుర్కొనే సమస్యలను తెలిపి ద్విచక్ర వాహనదారులు ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామంలోకి ప్రవేశం, బయటకు వెళ్లే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా చోరీలను అరికట్ట వచ్చని ఎస్పీ తెలిపారు.

అంటరానితనం నిర్మూలించాలి

అంటరానితనం నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ ఎస్టీ జెఎసి ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ జగదీష్‌ను కోరారు. జెఎసి నాయకుడు చలమప్ప మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతున్నా నేటికీ చాలా గ్రామాల్లో అంటరానితనం కొనసాగుతుందన్నారు. సమాజంలో మార్పు వచ్చేలా పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి జిల్లా నాయకులు దొన తిమ్మప్ప, ప్రజా సంఘం నాయకులు మారుతి, నాగరాజు, చెన్నమల్లి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ జగదీష్

డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

25 ఏళ్ల డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-కళాదుర్గం రూరల్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో జరుగుతున్న డ్రెయినేజీ పనులను పరిశీలించారు. 25 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని డ్రెయినేజీ సమస్యకు ఎమ్మెల్యే పరిష్కారం చూపారు. పనులను నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. త్వరగా పనులను పూర్తి చేసి డ్రెయినేజీ ద్వారా వరద నీరు వెళ్లేలా చేయాలని అధికారులను ఆదేశించారు.

అంగన్వాడీ సిబ్బందికి నియామక పత్రాలు అందజేత

నూతనంగా ఎంపికైన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు శుక్రవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నియామక పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే అంగన్వాడీ సెంటర్ల ద్వారా పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు.

ఎమ్మెల్యేని కలిసిన ఆర్డీవో

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును ఆర్డీవో వసంత్‌బాబు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు, రేపు ఓటరు నమోదు

కళ్యాణదుర్గం : పట్టణంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడతామని తహశీల్దార్ భాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో బిఎల్‌ఒలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కుందుర్పి

కిడ్నీ ఇన్ఫెక్షన్ బాధితుడికి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దెనాయక్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు.. మండలంలోని జంబుగుంపల గ్రామానికి చెందిన దుర్గన్న కిడ్నీ ఇన్ఫెక్షన్‌తో బాధ పడుతున్నారు. దుర్గన్నకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అనారోగ్యానికి గురవడంతో బెంగళూరులోని సెయింట్ జాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారి ఆర్థిక పరిస్థితి తెలిసి ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దెనాయక్ మండలంలోని మాకొడికి ప్రభుత్వ పాఠశాలలో దుర్గన్న తమ్ముడు చౌడప్పకు రూ. 15వేలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యాయులు ఉమాపతి, నాగిరెడ్డి పాల్గొన్నారు

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న బద్దెనాయక్

రైతు, కార్మిక నల్లచట్టాలను వ్యతిరేకిద్దాం

- 26న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో రైతు,కార్మిక, కూలీ సంఘాల నాయకులు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా తీసుకుని వస్తున్న రైతు నల్లచట్టాలని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి వాటి రద్దునకు జరుగుతున్నా ఆందోళనల్లో భాగస్వాములు కావాలని రైతు, కార్మిక, కూలీ సంఘాల జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. వ్యవసాయంలో నల్ల చట్టాలను రద్దు చేయాలని, కార్మికులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర కోశాధికారి జి.ఓబులు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, ఏసుదాసు అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, కౌలు రైతుదసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య, హమాలీ యూనియన్ నాయకులు వెంకటనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, రైతు సంఘం నాయకులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, నాగ ముత్యాలు, కిష్టా, వీర నారప్ప తదితరులు హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలకు నష్టం కలిగించే చర్యలకు పూనుకుంటోందన్నారు. రైతుల నల్ల చట్టాలు, లేబర్ కోడ్లను బలవంతంగా అమలు చేయడానికి కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో పంటలకు గిట్టుబాటు ధర చట్టం, స్మార్ట్ మీటర్ల రద్దు, రైతు రుణ విమోచన చట్టం, ఉపాధి కూలీలకు 200 రోజులు పనులు, ఢిల్లీ రైతు ఉద్యమంలో చనిపోయిన 750 మంది రైతులకు పరిహారం, పంట సాగు ఆధారంగా కౌలు రైతులందరికీ ఈక్రాప్ బుకింగ్, పంటల బీమా, సిసిఆర్‌సి కార్డులు, బ్యాంకు రుణాలు తదతర సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 26వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మిక, కర్షక సంఘాల నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నిరసన కార్యక్రమాల్లో ప్రజలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుళ్లాయి స్వామి, చంద్రిక, ఎన్టీఆర్ శీనా, ఆజాం, రైతుకూలీ సంఘం కృష్ణ, పిడిఎస్‌యు జిల్లా నాయకులు వీరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

జడ్పీ స్టాండింగ్ కమిటీ దృష్టికి మండల సమస్యలు

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి ప్రభావతమ్మ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో నెలకొన్న పలు మేజర్ సమస్యలను జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు జడ్పిటిసి ప్రభావతమ్మ ఫోన్ ద్వారా తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన భైరవానితిప్ప కుడి కాలువ ఆయకట్టు రైతులకు రబీ సీజన్‌లో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని కోరారు. అలాగే మండ లంలో గుండిగానిపల్లి, వేపులపర్తి, గొంచిరెడ్డిపల్లి, కన్నేపల్లి, భైరసముద్రం, వెస్ట్ కోడిపల్లి, బుడమేపల్లి, తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రహరీ ఎత్తు పెంచాలని, రోడ్లు నిర్మించాలని విన్నవించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నాడు-నేడు పనుల్లో అవకతవకలపై విచారణ జరిపించాలని, తదితర మేజర్ సమస్యలను జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీలో ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు.

ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేయాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించవచ్చునని రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు, జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం కోఆర్డినేటర్ చెన్నరాయుడు అధ్యక్షతన పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ముందుగా వేరుశనగ, కంది పంటలను పరిశీలించి, సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వాణిజ్య పంటలైన దానిమ్మ, చీని, బొప్పాయి పంటలను ఆధునిక పద్ధతుల్లో సాగు చేసేలా రైతులు సంసిద్ధం కావాలన్నారు. ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలను సంప్రదిస్తూ పంటల సాగు, ఎదుగుదల, నీటి యాజమాన్య పద్ధతులు, నివారణ, తదితర అంశాలపై సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వాలు

'పోరుయాత్ర'లో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతరం కలెక్టరేట్

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకుండా పోయిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరుయాత్ర శుక్రవారం నగరంలోని రాజీవ్‌కాలనీలో ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించాయన్నారు. ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతూ నిత్యావసర సరుకుల ధరలను అరికట్టడంలో విఫలమయ్యాయన్నారు. అలాగే మహిళలు, దళితులు బాలికలపై నిత్యం అత్యాచారాలు, హత్యలు దాడులు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేదన్నారు. వీటిపైన విమర్శలు చేసుకుంటూ సమస్యలు, ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళలందరికీ ఉచితంగా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు కొందరికే ఇవ్వడం మోసం చేయడమే అన్నారు. అలాగే ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని, నాణ్యమైన కరెంటు ఇస్తామని చెప్పి, రైతులకు కరెంటు మీటర్లు పెట్టమని, స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ అమలు చేస్తున్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 1వ నగర కార్యదర్శి రామిరెడ్డి, రాజీవ్‌కాలనీ ఉపసర్పంచి మసూద్, సిపిఎం నగర నాయకులు ప్రకాష్, వలీ, నూరుల్లా, డేవిడ్, మహదేవ్ నగర్ శాఖ కార్యదర్శి వెంకట, శ్రీనివాసులు, గణేనాయక్ కాలనీ శాఖ కార్యదర్శి రాము, లాలు, ఆది, రాజగోపాల్, మంజు, శంషాద్, పీరా, షేక్షావలి, రియాజ్, నరసింహులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాపోరు యాత్ర చేపట్టినట్లు సిపిఎం నాయకులు నాగేంద్ర, జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని అశోక్‌పిల్లర్ నుంచి ఎన్‌జిఒ హోం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయన్నారు. నిత్యావసర ధరలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే సామాన్యులకు అందుబాటులోకి తేవాలని, మహిళలు చిన్నపిల్లలపై దాడులను నియంత్రించాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పన కల్పించాలి, నిత్యవసర ధరలు నియంత్రించాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి డిమాండ్ చేశారు.

పామిడి : జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు రాక జిల్లాలోని మూడు లక్షల ఎకరాలు బీడుగా మారాయన్నారు. వేరుశనగ, పత్తి, కంది, ఆముదం, ఇతర పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. పంటలకు కీలకమైన జూలైలో 62 శాతం, సెప్టెంబర్‌లో 56శాతంలోటు వర్షపాతం నమోదు కావడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఈసమయంలో జిల్లానే కరువు జిల్లాగా ప్రకటించాల్సిన ప్రభుత్వం కేవలం జిల్లాలో 31 మండలాలకు ఏడు మండలాల్లో మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాను సవరించి మిగతా 24 మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించి పంట నష్టపరిహారం అందజేయాలని కోరారు. అలాగే ఉపాధి హామీ ద్వారా అదనపు పని దినాలు కల్పించి రూ.600కు తక్కువ కాకుండా వేతనం పడేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతుసంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ముత్యాలు, శంకర, మాబు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో నిర్వహించిన పోరుయాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులు

సిపిఎం ప్రాంతీయ కమిటీ ఎన్నిక

సిపిఎం జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడిపత్రి : పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో నరసింహారెడ్డి అధ్యక్షత నిర్వహించిన సిపిఎం ప్రాంతీయ 4వ మహాసభలో ప్రాంతీయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేంద్ర, సిపిఎం సీనియర్ నాయకురాలు శిరీషా ముఖ్య అతిథిగా హాజరైరయా పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రాంతీయ కన్వీనర్‌గా జగన్మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా రాజారామిరెడ్డి, నరసింహారెడ్డి, అంజి, రామ్మోహన్ చంటి, శ్రీరాములును ఎన్నుకున్నారు.

మౌలానా అబుల్‌కలాం ఆజాద్ విగ్రహం ఏర్పాటు

అనంతపురం కలెక్టరేట్ : ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో శుక్రవారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద స్వాతంత్ర్య సమరయోధులు, తొలి విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. టవర్‌క్లాక్ వద్ద విగ్రహాన్ని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తొలగించారు. తర్వాత విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జిల్లాలోని కొందరు మైనార్టీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అప్పటి నాయకుల్ని కోరినా ఏమాత్రం పట్టించుకోలేదు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యేగా దగ్గుపాటి గెలిచిన తర్వాత కొందరు మైనార్టీ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి తిరిగి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

ఢిల్లీ ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు జెఎన్‌టియు విద్యార్థులు

అనంతపురం : ఢిల్లీలో జరగనున్న ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎంపికయ్యారు. ఈమేరకు పరేడ్‌కు ఎంపికైన విద్యార్థులు ఎస్.వెంకటేష్ నాయక్, జి.నందితను శుక్రవారం జెఎన్‌టియులోని ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శారద, తదితరులు పాల్గొన్నారు.

పరేడ్‌కు ఎంపికైన విద్యార్థులతో జెఎన్‌టియు సిబ్బంది

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి

మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణ పరిధిలో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్న వారందరూ పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అధ్యక్షతన చిరు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదన్నారు. పట్టణ అభివృద్ధి చెందాలన్నా, ప్రత్యేక గుర్తింపు పొందాలన్నా పట్టణ పరిశుభ్రత కీలకమన్నారు. ప్రతి వ్యాపారి తమ పరిధిలో పరిశుభ్రత ఉండేలా చూసుకోవాలని సూచించారు.

చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

బడ్జెట్‌లో వైద్య రంగానికి నిధులు కేటాయించాలి

ప్రజారోగ్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు కొండయ్య, శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర బడ్జెట్‌లో అనంతపురం ఆరోగ్యరంగానికి నిధులు కేటాయించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజారోగ్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు కొండయ్య, శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సంగమేష్ నగర్‌లో ఉన్న పీపుల్స్ లైబ్రరీ హాల్లో డాక్టర్ కొండయ్య అధ్యక్షతన ప్రజారోగ్య వేదిక విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా అనంతపురం ఆరోగ్య రంగం అభివృద్ధి నోచుకోలేదన్నారు. అత్యంత జనాభా కలిగిన అనంతపురం ప్రాంతంలో ప్రధానమైన సూపర్ స్పెషాలిటీ, సర్వజన ఆసుపత్రులతోపాటు మెడికల్ కళాశాల క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ప్రజలు ఆరోగ్యం కోసం ప్రయివేట్ ఆసుపత్రుల వైపు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి జరగబోయే బడ్జెట్‌లో అనంతపురం ఆరోగ్య రంగానికి నిధులు కేటాయించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, డాక్టర్ ప్రసూన, రవిచంద్ర, మురళి, తిరుపాల్, యూనిసెఫ్, గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

కందుకూరులో వైద్య చికిత్సలు చేస్తున్న వైద్యులు

అనంతపురం : సమాజంలో ప్రతి మనిషికీ ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి అని సుర్య ఛారిటబుల్ ట్రస్టు కోఆర్డినేటర్ ఎ.ప్రశాంతి సూచించారు. శుక్రవారం రూరల్ పరిధిలోని కందుకూరు పంచాయతీలో సుర్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సాధారణ ఫీజుతో హెల్త్ చెకప్ నిర్వహించారు. ఇందులో భాగంగా బిపి, షుగర్, థైరాయిడ్, లివర్, కిడ్నీ, తదితర పరీక్షలతోపాటు విటమిన్ల లోపంపై అవగాహన కల్పించారు. విటమిన్ లోపం ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ప్రశాంత్‌కుమార్, లింగమయ్య, ట్రస్టు మండల కోఆర్డినేటర్ సరిత, ట్రస్టు వాలంటీర్లు ఉదయ్, నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

నార్పల : మండల పరిధిలోని సిద్ధరాచర్ల గ్రామ రచ్చకట్ట వద్ద సర్పంచి సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం హర్షిత ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.రాము నేతృత్వంలో మధుమేహం, గ్యాస్ట్రిక్, ఫైల్స్‌ఫిస్టులా, వెరికోస్ వైన్స్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పాలీట్రామా, చెవి, ముక్కు, గొంతు, న్యూరో యురాలజీ, మొదలగు జబ్బులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామచంద్ర ఫార్మాసిస్ట్ రాజశేఖర్, మేనేజర్ హరి, జిఆర్‌బిఎస్ మారుతి, సిబ్బంది, గ్రామస్తులు నాగిరెడ్డి, తిరుపాల్, రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రాల సిబ్బందితో సమీక్ష

ఉరవకొండ : విడపనకల్లు మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవాకేంద్రం సిబ్బందికి మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పంట కోత ప్రయోగాలపై వివరించి సూచనలు సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా ఈక్రాప్ బుకింగ్ ప్లానింగ్, ఖరీఫ్ ఈ క్రాప్ బుకింగ్, ఫిజికల్ అక్నాలజ్‌మెంట్ పెండింగ్ ఏమైనా ఉంటే ఫిర్యాదు చేయాలని వివరించారు. పాడి పంటల మ్యాగజైన్లకు సంబంధించి ప్రతి ఆర్‌ఎస్‌కె నుంచి 15మంది రైతులతో చందాలు చేయించాలన్నారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి అందజేసి బ్యాంకు రుణాలు పొందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎఇఒ రాఘవేంద్ర, క్షేత్రస్థాయి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

రేపటి నుంచి మండల కేంద్రంలోని విఘ్నేశ్వర ఆలయం ప్రాంగణంలో వినాయక ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న అష్ట ద్రవ్య మహా గణపతి హోమం, వాస్తు పూజ, వాస్తు బలి, వాస్తు హోమం, 11న మహాగణపతి, మృత్యుంజయ, లక్ష్మీ వినాయక, మహా సుదర్శన, గాయత్రి హోమాలు, భగవతి పూజ, దీపారాధన, 12న 108 కొబ్బరికాయల హోమం, సరస్వతి పూజ, శత్రుదోష నివారణ పూజ (కాళీ పూజ), దీపారాధన, 13న ధ్వజస్తంభ ప్రతిష్టాపన, గణపతి హోమం, మహా మంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'ఉపాధి'లో అక్రమాలను అరికట్టాలి

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి

డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధి హామీ చట్టంలో చోటు చేసుకుంటున్న అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డ్వామా పీడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, కౌలుదారుల సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య మాట్లాడుతూ జిల్లాలో అనేకమంది వ్యవసాయ కార్మికులు రెక్కల కష్టం మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అలాంటి వారికి ఉపాధి హామీ చట్టం ఒక వరం లాంటిదన్నారు. అయితే ఇలాంటి చట్టంలో కొంతమంది అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారన్నారు. సామాజిక తనిఖీ ద్వారా ఇప్పటికే జిల్లావ్యాప్తంగా రూ.5కోట్ల అవినీతి జరిగిందని పత్రికల్లో వార్తలు వస్తున్నప్పటికీ ఎలాంటి విచారణ, చర్యలు తీసుకున్న పాపానపోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో విచారణ చేసి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు పాల్గొన్నారు.

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు ఉద్యోగోన్నతి

విశ్వేశ్వరని సన్మానిస్తున్న సిబ్బంది

పుట్లూరు : మండలంలోని తక్కళ్లపల్లి వివిఎ (గ్రామ వ్యవసాయ సహాయకులు)గా విధులు నిర్వర్తిస్తున్న విశ్వేశ్వరి ఎఇఒ (వ్యవసాయ విస్తరణ అధికారి)గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా శింగనమల మండలానికి బదిలీ అవుతున్న సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసులు, ఎఇఒ హరి, వివిఎ భార్గవి, విహెచ్ఎ ఆదినారాయణ, ప్రవీణ్, రామలక్ష్మి, మనోరమ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం : ఎంపిడిఒ

యల్లనూరు : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిశుభ్రతే లక్ష్యమని ఎంపిడిఒ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. మండలంలోని పంచాయతీల్లో రోడ్లపై మురికి నీరు కనిపించకుండా చూడాలన్నారు. ఇందుకు ఉపాధి హామీ పథకం కింద సోక్‌పిట్స్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే చేశారన్నారు. డ్రైయినేజీలు లేని ప్రాంతాల్లో సోక్‌పిట్ ఏర్పాటు చేసుకుని అందులో నీటిని వదిలే వెసులుబాటు కల్పించామన్నారు. ఒక సోక్‌పిట్‌కు రూ.6,600 బిల్లు చెల్లించనున్నట్లు తెలిపారు.

స్క్రీనింగ్ పరీక్ష వాయిదా

గుత్తి : ఎపి ప్రభుత్వం సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిరుపేద ఎస్సీ, ఎస్టీల సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం నిర్వహించే స్క్రీనింగ్ పరీక్ష వాయిదా పడినట్లు సాంఘిక సంక్షేమ సహాయ అధికారిణి బి.రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు, పశ్చిమ, గుంటూరు, కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కోడ్ ఉండడంతో ఈనెల 10వ తేదీన జరగాల్సిన మెగా డీఎస్సీ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా వేసినట్లు చెప్పారు. త్వరలో పరీక్ష నిర్వహించే తేదీని తెలియజేస్తామని తెలిపారు.

గుంతల రోడ్లకు మోక్షం : ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఐదేళ్లుగా చాలా అధ్వాన్నంగా ఉన్న రోడ్లతోపాటు డ్రెయినేజీ వ్యవస్థకు త్వరలోనే మోక్షం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని పాతూరు 12వ డివిజన్‌లో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కార్పొరేటర్ జనబలం బాబాతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దుకాణం వద్దకూ వెళ్లి సమస్యలు సమస్యలపై ఆరాతీశారు. ప్రధానంగా తిలక్ రోడ్డు సమస్యపై ప్రస్తావించారు. ఇరుకైన రోడ్లు ఉన్నాయని.. పైగా గుంతలు పడి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. డ్రైనేజీలు కూడా సరిగా శుభ్రం చేయడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్లు అధ్వాన్నంగా మారాయని అన్నారు. ఇప్పటికే నగరంలోని రోడ్ల మరమ్మతులకు రూ.35 లక్షలతో ఎన్‌సిఎపి నిధులు కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. త్వరలోనే నిధులు రాగానే గుంతలు పడ్డ రోడ్లన్నింటికీ మరమ్మతులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కృష్ణకుమార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహా, రాయలసీమ బలిజ సంఘం యువజన జిల్లా అధ్యక్షుడు తొండపునాటి రమేష్, మాజీ కోఆప్షన్ మెంబర్ మున్వర్, నాయకులు బాల, సుంకన్న, ఈడిగ నాగభూషణం, సిరిసాల రాంబాబు, మురళి పాల్గొన్నారు.

డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

నేడు ప్రాంగణ నియామకాలు

అనంతపురం : స్థానిక జెఎన్‌టియులో ఈనెల 9వతేదీన ఫైనల్ ప్రాంగణ నియామకాలు నిర్వహించనున్నట్లు క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె.శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం జెఎన్‌టియుకు చేరుకున్న ఫ్యాక్టసెట్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ బృందం సభ్యులకు ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఇసిఇ, సిఎస్‌ఇ ఇంజినీరింగ్ విద్యార్థులు, ఎంసిఎ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కెరీర్ అవకాశాలపై ఫ్యాక్టసెట్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీచరణ్ వివరించారు. అనంతరం విద్యార్థులందరికీ ఆన్‌లైన్ రాతపరీక్ష నిర్వహించి 31 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరందరికీ ఈనెల 9న ఫైనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి రూ.10లక్ష వేతనంతో ఉదోయయగాలకు తీసుకోనున్నట్లు ప్రకటించారు.

ఫ్యాక్టసెట్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ బృందం సభ్యులకు స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అనంతపురం : విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వైబిపిటిఎ.ప్రసాద్ ఆదేశాల మేరకు నగరంలోని కిరాణా దుకాణాలపై అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇందులో భాగంగా పాతూరులోని సతీష్ జనరల్ స్టోర్స్, సాయివల్లి మిక్చర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తయారీదారుని పేరు, తేదీ, ముద్రించకపోవడం, వినియోగదారులకు అవసరమైన సమాచారం లేకపోవడం, ప్యాకింగ్‌లపై ఎంఆర్‌పి ధర లేకపోవడం వంటివి గమనించి లీగల్ మెట్రోలజి యాక్ట్, 2009 చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి రూ.50,000 విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిఐ జమాల్‌బాషా, జె.వాసుప్రకాష్, డిసిటిఒ విజయలక్ష్మి, బి.సురేష్‌కుమార్, మహమ్మద్‌గౌస్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ సాలమన్‌రాజ్

ప్రతి ఒక్కరూ చదవాలి : ఎంపిడిఒ

బుక్కరాయసముద్రం : సమజాంలోని ప్రతి ఒక్కరూ చదివేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ సొలమన్‌రాజ్ సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ద్వారా జరిగే నిరంతరం విద్యా కార్యక్రమం ఉల్లాస్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో ప్రతి ఒక్కరికీ ప్రత్యేక గుర్తింపు అన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య శాఖ సూపర్‌వైజర్ ఉషారాణి, వెలుగు ఎపిఎం నారాయణస్వామి, సీసీలు ఈశ్వరయ్య, ఇందిరమ్మ, లక్ష్మీనారాయణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగమణి, మహిళా యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌లను ఒబిసిలో చేర్చాలి

ఉరవకొండ : వీరశైవ లింగాయత్‌లను ఒబిసిలో చేర్చేందుకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని అఖిలభారత వీరశైవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవరం ఉరవకొండలోని వీరశైవ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజంలో 27శాతం ఉన్న వీరశైవ లింగ బలిజలను ఒబిసిలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత వీరశైవ సభ్యులు టి.మల్లికార్జున, తాలూకా వీరశైవ సభ్యులు పి.నాగనగౌడ్, పి.నిరంజన్‌గౌడ్, దేశాయ్ గంగాధర్, జె.బొజ్జప్ప, వీరేష్, మల్లికార్జున, దేశాయి వీరేష్, పాటిల్ రాజశేఖర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం

వైసిపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి హయాంలోనే సిఎం జగన్ పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేశారని వైసిపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయానికీ 10 మంది సిబ్బందిని నియమించి గడప గడపకూ ప్రభుత్వం సేవలను అందించారన్నారు. వాలంటీర్ వ్యవస్థ లేదని చెబుతున్న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ జూన్ 1వ తేదీన జీతాలు ఎలా ఇచ్చారో చెప్పగలరా.. అని ప్రశ్నించారు. సిఎంఎఫ్ఎస్‌ని 2017లో పంచాయతీరాజ్ వ్యవస్థకు అనుసంధానం చేసి పంచాయతీరాజ్ నిధులను దారి మళ్లించింది చంద్రబాబు కాదా? అన్నారు. 2024-25కు రాజ్యాంగ బద్ధంగా కేంద్రం 15వ ఫైనాన్స్ కమిషన్ కింద ఈ రాష్ట్రానికి రూ.988.77 కోట్లు విడుదల చేస్తే ఇందులో మీ గొప్పతనం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే ఏఒక్క గ్రామానికీ రూపాయి నిధులు విడుదల చేయలేదన్నారు. పవన్ కళ్యాణ్‌కు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల మీద చిత్తశుద్ధి ఉంటే కనీసం ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పప్పూరు రామాచార్యులకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

స్వతంత్ర సమరయోధులు, శ్రీబాగు వడంబడికలో రాయలసీమకు ప్రాతినిథ్యం వహించిన ప్రముఖుల్లో ఒకరు పప్పూరు రామాచార్యుల జయంతిని పురస్కరించుకుని అనంతపురం సాహిత్య మిత్రబృందం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య, సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు టివి.రెడ్డి మాట్లాడుతూ పప్పూరు రామాచార్యులు రాయలసీమ ఉద్దండుల్లో ఒకరు అన్నారు. ఆయన రచనలు, సంపాదకీయాలు, రాయలసీమ వెనుకబాటు తనానికి అద్దం పడుతూ యువతలో చైతన్య నింపడానికి 15 రోజులకు ఒకమారు వ్యాసాలు ప్రచురించేవారని గుర్తు చేశారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాషువా పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగయ్య, అనంత సాహితీ ప్రస్థానం వ్యవస్థాపకులు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, విశాలాంధ్ర బుక్‌హౌస్ నిర్వాహకులు చెట్ల ప్రవీణ్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షులు కె.సుబ్బరాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, విశాలాంధ్ర నిర్వాహకులు శ్రీనివాసులు, హరీష్, తిమ్మప్ప, పాల్గొన్నారు.

రామాచార్యులకు నివాళులర్పిస్తున్న సాహిత్య మిత్రబృందం

వజ్రకరూరు మండల సిపిఎం కార్యదర్శిగా విరూపాక్షి

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండల సిపిఎం నూతన కార్యదర్శిగా గూళ్లపాళ్యం విరూపాక్షిని ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని జనార్ధనస్వామి ఆలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన మండల మహాసభలో కార్యదర్శితోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విరూపాక్షి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సమస్యల పరిష్కారానికి ఇప్పటికే అనేక ఉద్యమాలు చేశామన్నారు. ముఖ్యంగా హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి మండలంలోని చివరి ఆయకట్టు వరకూ సాగు, తాగునీరు అందించాలని, బడ్జెట్‌లో రూ.7వేలకోట్లు కేటాయించాలన్నారు. వజ్రకరూరు-గుంతకల్లు మెయిన్ రోడ్డు నుంచి కమలపాడుకు తారు రోడ్డు ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్య కొరత లేకుండా ట్యాంకులు, కొళాయిలు పెంచాలని, 50ఏళ్లు నిండిన హమాలీలందరికీ పెన్షన్ ఇవ్వాలని, ఇళ్లస్థలాలు ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు రూ.6లక్షలు ఇవ్వాలని, భూమిలేని నిరుపేదలకు సాగుభూములు ఇవ్వాలని, నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చాబాల సుధాకర్, పెద్దన్న, మునెమ్మ, ఓబుళపతి, ప్రకాష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఎస్‌వి' కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల ఏర్పాటై 20ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాల ఛైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా క్రీడా, ఎత్నిక్ డే సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కెయు క్రీడా విభాగం ఆచార్యులు జెస్సీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు చాలా అవసరమన్నారు. క్రీడలు మనిషిలో శారీరక శక్తిని పెంచుతుందన్నారు. అనంతరం క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. 2వరోజు ఎత్నిక్‌డేలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఎఒ శ్రీనాథ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అతిథులను సన్మానిస్తున్న ఎస్‌వి కళాశాల యాజమాన్యం

నేరాలు ఘోరాలు

గాయపడిన వృద్ధుడు మృతి

గుత్తి : పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో గురువారం రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన వృద్ధుడు శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పూలకుంట గ్రామానికి చెందిన చిన్న కదిరప్ప (74) పని నిమిత్తం గుత్తి పట్టణానికి వచ్చాడు. గుంతకల్లు రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న అతన్ని లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వృద్ధుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు.

డ్రిప్పు పరికరాలకు నిప్పు

[illegible] అరటి తోట

పుట్లూరు : మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి తోటలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డ్రిప్పు పైపులకు నిప్పు పెట్టారు. దీంతో డ్రిప్పు పరికరాలు, పైపులతోపాటు అరటి చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు రాజశేఖర్‌రెడ్డి వాపోయారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల వ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీలో తేదీల వారీగా గ్రామసభలు నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రెడ్డిశేఖర్ సూచించారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం తహశీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అందులో తమ కాలనీలో ఓ వ్యక్తి దౌర్జన్యంగా రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారని, రోడ్డులోనే మెట్లు నిర్మించారని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని స్థానిక షిరిడి నగర్ వాసులు, పెద్దచెరువును పరిరక్షించాలని గ్రామస్తులు కోరారు. గ్రామసభలో పలువురు వివిధ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. గ్రామసభలో మండల సర్వేయర్ వినోద్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు నాగరాజు, రామంజి, రామకృష్ణ, టిడిపి మండల కన్వీనర్ సిద్దలింగప్ప, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, నాయకులు శివ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో అర్జీలు ఇస్తున్న గ్రామస్తులు

లేపాక్షి : మండలంలోని కోడిపల్లి పంచాయతీ కేంద్రం వద్ద నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో 29 అర్జీలు అందినట్లు తహశీల్దార్ కుమార్‌రెడ్డి తెలిపారు. అందులో రెవెన్యూకి సంబందించిన 14 అర్జీలు, పింఛన్ల కోసం 6, గృహాల కోసం 9 అర్జీలు అందాయి. గ్రామసభలో సర్పంచి మంజునాథ్, ఎంపీటీసీ గంగాధర్, ఆర్ఐ ప్రమీలమ్మ, వీఆర్వో నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని గంగంపల్లి గ్రామంలో తహశీల్దార్ మారుతి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. పలు సమస్యలపై రైతులు వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ సోమశేఖర్, టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, రుద్రప్ప, నరసింహులు, రవీందర్‌రెడ్డి, సూర్యనారాయణ, రామస్వామి, గంగాద్రి, శివప్ప, శ్రీనివాసులు, వాసునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మెట్టును సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి కార్యకర్తలు అధైర్యపడొద్దు : 'మెట్టు'

ప్రజాశక్తి-డి.హీరేహాల్

వైసిపి శ్రేణులు ఏ ఒక్కరూ భయపడొద్దని, పార్టీతో పాటు తాను అండగా ఉంటామని నియోజక వర్గ సమన్వయకర్త మెట్టు గోవింద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన శుక్రవారం డి.హీరేహాల్‌లో ఎర్రిస్వామి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు, కార్య కర్తలు పార్టీ కోసం మనోధైర్యంతో ముందుకెళ్లాలే కానీ వెనకడుగు వేయరాదన్నారు. ఏ ఒక్కరికీ కష్టం వచ్చినా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసాను ఇచ్చారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డిని మండల నాయకులు రహంతుల్లా, సింగాడి జగదీష్, హనుమంతరెడ్డి, శివారెడ్డి, రామకృష్ణ శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వంద్రప్ప, మంజునాథ, తిమ్మారెడ్డి, తదితరు లు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయండి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతురాయుడు, నియోజకవర్గ కార్యదర్శి నవీన్, కోశాధికారి పవన్, పట్టణ అధ్యక్షుడు హర్షవర్ధన్, నాయకులు వర్ధన్, మంజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిపిఐ తాలూకా కార్యదర్శివర్గ సభ్యుడు కొట్రేష్ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ఏఈ బాలచంద్రకు వినతిపత్రం ఇచ్చారు. కొట్రేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా మంది రైతులు డిడి చెల్లించి చాలా రోజులైనా ఇంతవరకూ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయలేదన్నారు. దీంతో రైతులు పంటలు సాగు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుర్గన్న, ఎపి రైతు సంఘం తాలూకా అధ్యక్షులు నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా అధ్యక్షులు నాగరాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు కుమార్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన భౌతిక శాస్త్రం విద్యార్థులు 30 రోజుల పాటు స్థానిక బళ్లారి రోడ్డులో ఉన్న శ్రీరామకృష్ణ వద్ధాశ్రమంలో వృద్ధులకు వివిధ రకాల పండ్లు అంద జేశారు. వారు నెల రోజుల పాటు చేసిన సేవలకు గుర్తుగా విద్యార్థులకు వృద్ధాశ్రమం మేనేజర్ సురేష్ ప్రశంసాపత్రాలు అందజేశారు. సేవ చేసేందుకు అవకాశం కల్పించిన వృద్ధాశ్రమం యాజమాన్యానికి ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాప కులు లక్ష్మీనారాయణ, ప్రసాద్, నాగప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కోదండరాములు, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

ముదిగుబ్బ : మండలంలో ఎంఇఒగా పనిచేస్తూ రిటైర్మెంట్ పొందిన కిరణ్మయిని శుక్రవారం స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కిరణ్మయి మండల అభివృద్ధికి చేసిన సేవలను ఈసందర్భంగా వారు కొనియాడారు. అనంతరం ఆమెను సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు.

గుండుమలను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

గుండుమలకు సన్మానం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మోరుబాగల్ పంచాయతీ పరిధిలోని వీరజ్జనపల్లి, నాచేపల్లి గ్రామాల్లో టిడిపి నాయకుల గృహ ప్రవేశ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. వారిని మాజీ ఎంపిటిసి పురుషోత్తం, మాజీ వైస్ ప్రెసిడెంట్ హనుమంతరాయప్ప, రాజన్న శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, నాయకులు దుర్గేష్, న్యాయవాది శివకుమార్, మంజునాథ్, లక్ష్మీనరసప్ప, భీమరాజు, పురుషోత్తం, సన్నమారప్ప, వెంకటేష్, భోజరాజు, రాజేంద్ర, డాక్టర్ కృష్ణమూర్తి, జాని పాల్గొన్నారు.

రేపు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

పట్టణంలోని బస్టాండు కూడలిలో ఏర్పాటు చేఇన తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరిస్తున్నట్లు జిల్లా వడియరాజుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జె.వి.రమణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశు తెలిపారు. ఆసంఘం కదిరి డివిజన్ అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణం లోని బస్టాండ్ కూడలిలో నిర్మించిన వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ జిల్లాలోని వడ్డెరల సోదరులందరూ భారీ ఎత్తున హాజరుకావాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల తండాలో వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం సికెల్ సెల్ అనీమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, సిహెచ్‌ఒలు భవాని, భారతి, ఎఎన్ఎం పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-అనంతపురం

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిన నూతన కూటమి ప్రభుత్వం 12వ పిఆర్‌సికి సంబంధించిన మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రహ్మసముద్రం మండలంలోని కోనాపురం, సూగేపల్లి, పాల వెంకటాపురం, బ్రహ్మసముద్రం, ఎర్రడికేర, వెస్ట్ కోడిపల్లె, బొబ్బర్లపల్లి ఎర్రప్పదండి, మాముడూరు తదితర పాఠశాలలో ఎస్‌టియు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యంతర భృతితోపాటు పురపాలక ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, జి.పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఆగిన ఇంగ్లీష్ పదోన్నతులను చేపట్టాలని, కెజిబివి ఉపాధ్యాయినులకు ఎంటిఎస్ అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవో 117 రద్దు చేయాలని, 3, 4, 5వ తరగతుల విలీనాన్ని రద్దు చేసి ప్రతి తరగతికీ ఉపాధ్యాయుడిని కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం కొనసాగించాలని కోరారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మసముద్రం మండలం ఎస్‌టియు బాధ్యులు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు ఆనంద్‌రెడ్డి, కృష్ణమూర్తి, మల్లికార్జునగౌడ్, సిపిఎస్ కళ్యాణదుర్గం డివిజనల్ కన్వీనర్ తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

14న విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈనెల 14వ తేదీన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా స్వామివారి పంచలోహ విగ్రహాలను ప్రతిష్టించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా శుక్రవారం ముద్దిరెడ్డిపల్లి భక్తులు విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు, డీసీ ఆంజనేయులు, పల్లా లక్ష్మి కుమార్, పివి మంజునాథ్, చంద్రమోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

హిందూపురం : తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, జిల్లా అధ్యక్షులు అంజినప్ప, ఆ పార్టీ నాయకులు వివరించారు. ఈ మేరకు వారు శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ముదిరెడ్డిపల్లిలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లా లక్ష్మి కుమార్, చంద్రమోహన్ యాదవ్, మంచాల మారుతీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఓటరు నమోదు కోసం మండల వ్యాప్తంగా ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ రెడ్డిశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో గ్రామాల్లో పోలింగ్ బూత్ సెంటర్లలో బిఎల్‌ఒలు అందుబాటులో ఉంటారని, నూతన ఓటరు నమోదు, ఓటరు కార్డులో తప్పులు, మార్పులు, చేర్పులు చేస్తారన్నారు. ఈ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లేపాక్షి : ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపుల్లో మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ కుమార్‌రెడ్డి సూచించారు. ఓటరు జాబితా పోలింగ్ స్టేషన్‌లో బిఎల్‌ఒ వద్ద అందుబాటులో ఉంటుందన్నారు. మృతి చెందిన వారి పేర్లు తొలగిస్తారని తెలిపారు.

మడకశిర : రొళ్ల మండలంలోని ఎం.రాయపురం గ్రామంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ షేక్షావలి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారంతో భూముల సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తామని తెలిపారు. గ్రామసభలో టిడిపి మండల కన్వీనర్ దాసిరెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

రైతుల సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ బాబూరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూముల సమస్యలు ఉంటే అర్జీలు ద్వారా అందజేయాలని వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. డిసెంబర్ మూడో తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జాఫర్, ఆర్ఐ అశోక చక్రవర్తి, వీఆర్వోలు డి వెంకటరమణ, బి చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ సర్వేయర్ అసిస్టెంట్లు వేమ ప్రసాద్‌రెడ్డి, జగన్నాథం రెడ్డి, నాగేందర్ నాయక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండలంలోని కానుగమాకుల పల్లి,కంబాలదిన్నె రెవెన్యూ పొలాలకు సంబందించి శుక్రవారం స్థానిక పలగలపల్లిలో రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సంబందిత సమస్యలపై తహశీల్దార్ యూనస్ బాబు రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వారి భూ సమస్యలపై వినతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో వీఅర్వోలు, సర్వేయర్లు రైతులు పాల్గొన్నారు.